

జీవించేందుకే మనిషి తినాలి
సమాజ సంక్షేమానికి జీవించాలి
- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జన స్వరం
పవర్
అక్షరమే ఆయుధం

www.janaswaram.com


**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ :
janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 7013030690

సంపుటి : 4 | సంచిక : 91 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 12-10-2024 | పేజీలు : 5








## దుర్గమ్మకు హంస వాహన సేవ రద్దు



**విజయవాడ, అక్టోబర్ 11 (జనస్వరం) :** దసరా నవరాత్రులు శనివారంతో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో చివరి రోజు నిర్వహించే దుర్గమ్మ వారి హంస వాహనం సేవను ప్రభుత్వం రద్దు చేసింది. అమ్మవారి జలవిహారం రద్దు కావడంతో అందుకు అనుగుణంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. కృష్ణా నదిలో నీటి ప్రవాహ స్థాయి అధికంగా ఉంది. అలాగే ఎగువ ప్రాంతం నుంచి దాదాపు 40 క్యూసెకుల వరద నీరు నదిలో ప్రవహిస్తుంది. ఈ నేపథ్యంలో అమ్మ వారి జల విహారాన్ని రద్దు చేసినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. దాంతో దసరా చివరి రోజు దుర్గా ఘాట్‌లోని గంగా సమేత శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవాలయంలో పూజా కైంకర్యాలను దేవస్థానం అధికారులు నిర్వహించనున్నారు. అందుకోసం దేవాదాయ శాఖతోపాటు నీటి పారుదల శాఖ అధికారులు సంయుక్తంగా పనులు చేపట్టారు. ప్రతి ఏడాది దసరా చివరి రోజు... కృష్ణానదిలో అమ్మవారు జల విహారం చేస్తారు. కన్నుల పండువగా జరిగే ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అమ్మ వారి భక్తులు భారీగా విజయవాడ చేరుకునేవారు. అయితే కృష్ణా నదిలో నీటి ప్రవాహం కారణంగా ఈ ఏడాది అమ్మ వారి జలవిహారాన్ని నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదీకాక ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరద కారణంగా విజయవాడకు వరద నీరు పోటెత్తింది. దీంతో విజయవాడ నగరంలోని పలు ప్రాంతాలు వరద నీటిలో చిక్కుకుపోయాయి. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. అందులోభాగంగా సహాయక చర్యలు చేపట్టింది. దీంతో కొద్ది రోజుల్లోనే విజయవాడకు వరద ముంపు నుంచి ఉపశమనం లభించినట్లు అయింది. ఈ వరద కారణంగా విజయవాడ నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు పిలుపు మేరకు టాలీవుడ్ పరిశ్రమలోని పెద్దలతోపాటు ప్రజలు సైతం భారీగా కదిలి వచ్చారు. అలాగే కేంద్ర ప్రభుత్వం కూడా వరద నష్టంపై అంచనా వేసి నిధులను తక్షణ చర్యల్లో భాగంగా విడుదల చేసింది. ఇంకోవైపు విజయవాడలోని కృష్ణా నదిలో వరద ఉధృతి ఏ మాత్రం తగ్గడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో కృష్ణా నదిలో అమ్మవారికి హంస వాహన సేవను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అక్టోబర్ 3వ తేదీన ప్రారంభమైన శరన్నవరాత్రులు శనివారంతో ముగియనున్నాయి. ఈ తొమ్మిది రోజులు అమ్మవారు వివిధ అలంకరాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం మహిషాసురమర్ధిని రూపంలో.. శనివారం శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి రూపంలో ఇంద్రకీలాద్రిపై కొలువు తీరిన దుర్గమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్న సంగతి తెలిసిందే.

## నారీ శక్తిని గుర్తించి ప్రోత్సహించాలి

**నారా భువనేశ్వరి**



**విజయవాడ, అక్టోబర్ 11 (జనస్వరం) :** రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో విజయవాడ పున్నమి ఘాట్‌లో 'నారీ శక్తి' విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రులు అనిత, సవిత, అఖిలభారత సర్వీస్ అధికారుల సతీమణులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. నారీ శక్తి విజయోత్సవంలో భాగంగా పున్నమి ఘాట్‌లో నవదుర్గల హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పడవలపై కృష్ణానదిలో అమ్మవారి తొమ్మిది రూపాలు ప్రతిష్ఠించారు. వేదపండితులు అమ్మవారి ప్రతిమలకు హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ.. "దసరా అంటే ప్రతిఒక్కరికీ గుర్తుకొచ్చేది ఇంద్రీకలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ. అమ్మవారి ఆశీస్సులు మనపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నా. ఇలాంటి శుభసందర్భంగా మహిళా శక్తి గురించి మాట్లాడేందుకు అవకాశం రావడం సంతోషకరం. మహిళలు విజయాలు సాధిస్తే వారిని గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. మనలో ఎంతో శక్తి దాగి ఉంది. అది బయటకు తీస్తే వచ్చే ఫలితాలు ఎంతో గొప్పగా ఉంటాయి. మహిళలు అంతరిక్షంలోకి వెళ్తున్నారు.. యుద్ధవిమానాలు నడుపుతున్నారు. అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. పంచాయతీ సర్పంచి నుంచి రాష్ట్రపతి పదవి వరకు అన్ని పదవులను మహిళలు సమర్థంగా నిర్వహిస్తున్నారు. ఇవాళ మన దేశానికి ఒక గిరిజన మహిళ రాష్ట్రపతిగా ఉండటం ఎంతో గర్వించదగిన విషయం" అని అన్నారు. మంత్రి అనిత మాట్లాడుతూ.. మహిళలను ఎలా గౌరవించుకోవాలో తెలిపే వేదికగా ఈ నారీ శక్తి విజయోత్సవ కార్యక్రమం నిలవాలన్నారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళల శక్తే ఈ నారీ శక్తి విజయం అని అభివర్ణించారు. రాజకీయ నాయకులతో పాటు ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల వెనుక వారి సతీమణుల కృషి ఎంతో ఉందన్నారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళా సాధికారతకు ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు.

## పవన్ పేరుతో బెదిరింపులు..

**కాకినాడ డీఎఫ్‌ఓపై విచారణకు ఆదేశం**

**అమరావతి, అక్టోబర్ 11 (జనస్వరం) :** కాకినాడ డీఎఫ్‌వో రవీంద్రనాథ్‌రెడ్డిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విచారణకు ఆదేశించారు. వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సూచించారు. తన పేరు, కార్యాలయం పేరుతో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కాకినాడ అటవీశాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రవీంద్రనాథ్‌రెడ్డి.. మైనింగ్ వాహనాల విషయంలో కొన్ని రకాల ఆంక్షలు విధించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు ఆయన పేషీలోని ఉన్నతాధికారులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని వారి పేర్లు చెప్పి.. మైనింగ్, అటవీశాఖ అధికారులకు ఫోన్ చేసి బెదిరిస్తున్నట్టు అభియోగాలున్నాయి. ఈ వ్యవహారంపై డిప్యూటీ సీఎంకు పలు ఫిర్యాదులు అందాయి. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన పవన్ విచారణకు ఆదేశించారు.

## నాణ్యతలేని సరకులు విక్రయిస్తే చర్యలు

**మంత్రి నాదెండ్ల**



**విజయవాడ, అక్టోబర్ 11 (జనస్వరం) :** ప్రజలకు విక్రయించే సరకుల నాణ్యత, ధరలపై విజయవాడలోని రెండు రైతు బజార్లను పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మిక తనిఖీ చేశారు. గురునానక్ కాలనీ, పంటకాలువ రోడ్డులో ఉన్న రైతు బజా ర్లను ఆయన పరిశీలించారు. వంటనూనెలు, ఉల్లి, టమాటా విక్రయాలపై వినియో గదారుల నుంచి సమాచారం తెలుసుకున్నారు. పామాయిల్ లీటరు రూ.110కి, సన్ ఫ్లవర్ ఆయిల్ రూ.124కి విక్రయించేలా బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతు బజార్లలోని దుకాణాల వద్ద ధరలు సూచించే బోర్డులు అప్పటికప్పుడు వెంటనే ఏర్పాటు చేయించారు. ప్రజలకు విక్రయించే ఉల్లి, టామాటా నాణ్యతనూ పరిశీలిం చారు. నాణ్యత లేని ఉత్పత్తులు విక్రయిస్తే ఉపేక్షించబోమని మంత్రి హెచ్చరించారు.

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

**తేదీ : 12 అక్టోబర్ 2024,**
**తిథి : శుద్ధ నవమి (ఉ.11:01వ.కు)**
**నక్షత్రం : ఉ/షాఢ (తె.05:28వ.కు), శ్రవణం (13తా తె.04:30 వ.కు), బ్రహ్మ ముహూర్తం : తె.04:17ల తె.05:05,**
**రాహుకాలం : ఉ.08:49ల నుండి ఉ.10:16,**
**యమగండం : మ.01:11ల నుండి మ.02:39,**
**వర్జ్యకాలం : ఉ.09:20ల ఉ.11:04**

## ఈ రోజు నమాజ్ వేళలు

**తేదీ : 12 అక్టోబర్ 2024**
**ఫజర్ : తెల్లవారుజామున గం. 04:57**
**సూర్యోదయం : ఉదయం గం. 06:08**
**జొహర్ : మధ్యాహ్నం గం. 12:03**
**అసర్ : సాయంత్రం గం. 03:25**
**మఘ్రిబ్ : సాయంత్రం గం. 05:57**
**ఇష : రాత్రి గం. 07:09**





జన స్వరం
**విలేకరులు కావలెను**

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు
రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..
అసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# దసరా అంటే ఏమిటి..?

**- ఈ పండుగను ఎలా జరుపుకుంటారు..?**

**- విశిష్టత ఏంటి..?**

**అయి జగదంబ మదంబ కదంబవనప్రియవాసిని హాసరతే**
**శిఖరిశిరోమణి తుంగ హిమాలయశృంగనిజాలయ మధ్యగతే**
**మధుమధురే మధుకైతభగంజిని కైతభభంజిని రాసరతే**
**జయ జయ హే మహిషాసురమర్దిని రమ్యకపర్దిని శైలసుతే**

దసరా హిందువుల ముఖ్యమైన పండుగ. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజులు దేవీ నవరాత్రులు పదో రోజు విజయదశమి కలసి దసరా అంటారు. ఇది ముఖ్యంగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యత ఇచ్చే పండుగ. ఈ పండుగను నవరాత్రి, శరన్నవరాత్రి అని అంటారు. శరదృతువు ఆరంభంలో వచ్చే పండుగ కనుక ఈ పేరు వచ్చింది. కొందరు ఈ పండుగకు మొదటి మూడు రోజులు పార్వతిదేవికి తరువాతి మూడు రోజుల లక్ష్మీ దేవికి తరువాత మూడురోజులు సరస్వతి దేవికి పూజలు నిర్వహిస్తారు. ముఖ్యముగా శాక్తేయులు దీనిని ఆచరిస్తారు.

బొమ్మల కొలువు పెట్టడం ఒక ఆనవాయితీ. ఆలయాలలో అమ్మవారికి ఒక్కోరోజు ఒక్కో అలంకారం చేస్తారు. పదోరోజు దసరా పండుగ 'విజయదశమి' జరుపుకుంటారు. తెలుగు వారు దసరాని పది రోజులు జరుపుకుంటారు. ముందు నవరాత్రులు దుర్గ పూజ ఉంటుంది. తెలంగాణాలో ఈ తొమ్మిది రోజులు అమావాస్య నుంచి నవమి వరకు బతుకమ్మ ఆడుతారు. తెలంగాణా పల్లెల్లో ప్రతి అమావాస్యకి స్త్రీలు పట్టు పీతాంబరాలు ధరించడం ఆనవాయితీ.

'దసర' చెడు మీద మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ పండుగను విజయదశమి అని పిలుస్తారు. దీనిని పది రోజుల పాటు జరుపుకుంటారు. ముందు నవరాత్రులు దుర్గ పూజ ఉంటుంది. విజయదశమి



రోజున చరిత్ర ప్రకారం రాముడు రావణునిపై గెలిచిన సందర్భమే కాక పాండవులు వనవాసం వెళ్తూ జమ్మి చెట్టుపై తమ ఆయుధాలను తిరిగి తీసిన రోజు.

ఈ సందర్భంగా రావణ వధ, జమ్మి ఆకుల పూజా చేయటం ఆచారం. జగన్మాత అయిన దుర్గా దేవి మహిషాసురుడనే రాక్షసునితో తొమ్మిది రాత్రులు యుద్ధం చేసి అతనిని వధించి విజయాన్ని పొందిన సందర్భంగా 10వ రోజు ప్రజలంతా సంతోషంతో పండగ జరుపుకున్నారు. బ్రహ్మదేవుని వరాల వలన వరగర్వితుడైన మహిషాసురుడు దేవతలతో ఘోరమైన యుద్ధమి చేసి వారిని ఓడించి ఇంద్రపదవి చేపట్టాడు. దేవేంద్రుడు త్రిమూర్తులతో మొర పెట్టుకొనగా మహిషునిపై వారిలో రగిలిన క్రోధాగ్ని ప్రకాశవంతమైన తేజంగా మారింది. త్రిమూర్తుల తేజం కేంద్రీకృతమై ఒక స్త్రీరూపమై జన్మించింది. శివుని తేజం ముఖంగా విష్ణు తేజం బాహువులుగా బ్రహ్మ తేజం పాదాలుగా కలిగి మంగళమూర్తిగా అవతరించిన ఆమె 18 బాహువులను కలిగి ఉంది. ఆమెకు శివుడు శూలాన్ని, విష్ణువు చక్రాన్ని, ఇంద్రుడు వజ్రాయుధాన్ని, వరుణ దేవుడు పాశం, బ్రహ్మ దేవుడు అక్షమాల, కమండలం హిమవంతుడు సింహాన్ని వాహనంగా ఇచ్చారు. ఇలా సర్వదేవతల ఆయుధాలు సమకూర్చుకొని మహిషాసురుని సైన్యంతో తలపడి భీకరమైన యుద్ధాన్ని చేసింది. మహిషాసురుని తరపున యుద్దానికి వచ్చిన ఉదగ్రుడు, మహాహనుడు, అసిలోముడు, బాష్కలుడు, బిడాలుడు మొదలైన వారిని సంహరించిన తరువాత మహిషాసురునితో తలపడింది. ఈ యుద్ధంలో ఆదేవి వాహనమైన సింహం శత్రువులను చీల్చి చెండాడింది. దేవితో తలపడిన అసురుడు మహిషిరూపం, సింహరూపం, మానవరూపంతో భీకరంగా పోరి చివరకు తిరిగి మహిషిరూపంలో దేవి చేతిలో హతం అయ్యాడు. ఈ విధంగా అప్పటి నుండి మహిషుని సంహరించిన దినం దసరా పర్వదినంగా పిలవబడింది, అదే విజయదశమి.



**జమ్ము సాయి కల్యాణ్,**
**పొలిటికల్ అనలిస్టు,**
**మేనేజింగ్ డైరెక్టర్,**
**జనస్వరం మీడియా.**

# నేడు పాలపిట్ట దర్శనం



ఎపుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పాలపిట్ట దర్శనం రానే వచ్చింది. విజయదశమి పండుగ సందర్భంగా పాలపిట్టను దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ పాలపిట్ట దర్శనం శుభసూచికంగా భక్తులు భావిస్తారు. పాలపిట్టకు పురాతన చరిత్ర ఉంది. పాండవులు అజ్ఞాతవాసం ముగించుకుని అనంతరం జమ్మి చెట్టుపై దాచిన ఆయుధాలను స్వీకరిస్తారు. ఆ తరువాత ఆయుధాలను తీసుకెళ్లే సమయంలో పాలపిట్ట ఎదురవుతుంది. పాలపిట్టను దర్శనం చేసుకున్న అనంతరం పాండవులకు విజయమే కలుగుతుంది. ఇప్పటినుంచి నేటి నవ్విదయుగం వరకు శమీ వృక్షాన్ని దేవతా వృక్షంగా భక్తులు భావిస్తారు. ప్రతి ఏటా దసరా వేడుకలు జరుపుకోవాలని అనవాయితీ. వాళ్లలో భాగంగా అమ్మవారు. ఈ పది రోజులపాటు వివిధ రకాల దేవతామూర్తుల అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. అష్టమి నవమి అనంతరం దశమి జరుపుకోవడం ఆనవాయితీ. చివరి రోజున అమ్మవారు విజయ లక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమి స్తారు. దీనితో దసరా ఉత్సవాలు కూడా ముగుస్తాయి. పురాణాల ప్రకారం దశమి రోజున పాలపిట్టను చూడటం అదృష్టంగా భావిస్తారు. ఈ భక్తుల నమ్మకం వెనుక పురాణ ఖాధలు సైతం యంలో ఉన్నాయి. త్రేతాయుగంలో రావణాసురుడితో శ్రీరాముడు బయలుదేరిన సమయంలో విజయదశమి రోజు పాలపిట్ట ఎదురొస్తుందనే కథ వాడుకలో ఉంది. ఆ యుద్ధంలో రాముడు విజయం సాధించినట్లు పురాణ గాథలు స్పష్టం చేస్తున్నాయి. ఇకమహా భారతంలో అజ్ఞాతవాసానికి వెళ్లే ముందు జమ్మి చెట్టు మీద పాండవులు వారి ఆయుధాలను దాచి ఉంచుతారు. అజ్ఞాతవాసం అనంతరం తిరిగి ఆయుధాలు పొందిన తరువాత విజయదశమి రోజున పాలపిట్ట ఎదురు రావడం విజయం సాధించినట్లు ఇతిహాసాలు పురాణాలు చెబుతున్నాయి. ఈ ఆయుధాలను ఇంద్రుడు రూపంలో కాపు కాశారని ద్వారా తెలుస్తోంది. అలాగే అజ్ఞాతవాసాన్ని సైతం ముగించుకొని పాండవుల హస్తినాపురానికి వెళుతున్న సమయంలో వారికి పాలపిట్ట దర్శనమిచ్చిందని పురాణాలు చెబుతున్నాయి. నాటి నుంచి పాండవుల కష్టాలు తీరిపోయాయని ద్వారా తెలుస్తోంది. కురుక్షేత్రంలో విజయం సాధించడమే కాదు తిరిగి పాండవులు రాజ్యాన్ని సైతం చేజిక్కించుకున్నారు. అందుకే దసరా పర్వదినం రోజు పాలపిట్టను చూస్తే మంచి జరుగుతుందని అమ్మవారి భక్తులు విశ్వసిస్తారు. పురాణాలల్లో ఎంతో ప్రాచుర్యం పొందిన పాలపిట్టనే తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు అధికార పక్షిగా నిర్ణయించాయి. ఈ పక్షిని నీలకంఠం పక్ష అని కూడా పిలుస్తారు. కావున పాలపిట్ట దర్శనమం అనంతరం అంతా మేలు జరగాలని ఆశిద్దాం



గజ్జల శేషారెడ్డి
సీనియర్ పాత్రికేయులు
పులివెందుల

# కూతురి కోసం.. ఓ తండ్రి మనోవేదన
# "జ్ఞాపకాల ప్రతిధ్వనులు"

మీ జ్ఞాపకాలు, అవి సమీపంలో ఉన్నాయి,
నవ్వు, కన్నీళ్లు, భయంతో కూడిన గుసగుసలు.
నిన్ను మొదటి సారి నా చేతుల్లోకి తీసుకున్నప్పుడు నీ చిన్ని మొహం చూస్తున్న నా చూపుడు వేలిని పట్టుకున్న సందర్భం ఓ మధుర జ్ఞాపకం.
మహారాణిలా చూసుకుందాం అని కలలు కన్న... కానీ, ఆ కలలకు కొన్ని దుష్ట శక్తులు అడ్డుగా నిలబడ్డాయి..
ఏ రోజుకి అయిన అహంతో అడ్డుగా నిలబడిన ఆ గోడలను బద్దలు కొట్టుకుని నా చెంతకు చేరుతావని చూస్తున్న చిట్టి తల్లి.



**జమ్ము సాయి కల్యాణ్,**
**పొలిటికల్ అనలిస్టు,**
**మేనేజింగ్ డైరెక్టర్,**
**జనస్వరం మీడియా.**

# నాన్న

శంకర్ సారంగపాణి ఇద్దరు మాట్లాడుకుంటూ వెళ్తుంటారు. మళ్లీ ఏం జరిగిందన్న అని శంకర్ అడుగుతాడు. ఆ తర్వాత జీతం ఇచ్చే పనులలో చేరాను నా మొదటి సంపాదన 10 ఏళ్ల వయసులోనే. అప్పటి జీతం 20 రూపాయలు. ఇప్పటి జీతాలతో పోల్చుకుంటే అది చాలా తక్కువ. కానీ ఆ వయసులో సంపాదించానని చాలా గర్వంగా అనిపించింది అప్పుడు. పగలంత పనిచేసే వాడిని. రాత్రి అయితే 2రూపాయిలు పెట్టి సినిమా టికెట్టు కొనుక్కొని సినిమాకెళ్లేవాడిని. సినిమా చూడటానికి కాదు. ఆ ఫ్యాన్ కింద పడుకోవడానికి అని నవ్వుతూ చెప్పారు సారంగపాణి. అలా సినిమా థియేటర్లో నేను ఒక మూలన పడుకోవడం ఒక బంగారు నగలు అమ్ముకునే సేటు నన్ను చూసి "నాతో వస్తావా? నీకు పని ఇప్పిస్తాను" అని అన్నాడు. సరే ఏం పని అని అడిగాను. "నీకు అన్ని తర్వాత చెప్తానులే నాతో రా" అని తీసుకెళ్లాడు. ఆ రోజు రాత్రి బిర్యానీ తినిపించాడు. నాకు ఒక మంచి బట్టలు కూడా కొనిచ్చాడు. ఆ తర్వాత వేరే వ్యక్తి దగ్గరికి తీసుకెళ్ళాడు. అక్కడికెళ్తే నా వయసు వాళ్ళు, నాకంటే చిన్నవాళ్లు, పెద్దవాళ్లు, సుమారు ఒక 30 మంది దాకా ఉన్నారు. పెద్ద పెద్ద గుండాల్లాగా ఒక ఆరు ఏడు మంది ఉన్నారు. వాళ్ళందరికీ బాస్ లాగా ఒకడున్నాడు. వాళ్ళు ఏం చేస్తున్నారంటే ఈ పిల్లలకి గోడ దూకడం, గోడలు పగలగొట్టడం, అద్దాలు పగలగొట్టడం, ఇలాంటివన్నీ నేర్పిస్తున్నారు. అంతేకాదు, నలుగురిలో ఉన్నప్పుడు చైన్లు, కమ్మలు ఇలా బంగారు వస్తువులు ఎలా దొంగలించాలో ఇవన్నీ నేర్పించేవారు. నేను నేర్చుకుని అలాంటి దొంగతనాలు చేసేవాన్ని. మాకు రోజు బిర్యానీ పెడతారు మనమడిగినప్పుడల్లా కొత్త బట్టలు ఇస్తారు. రోజు ఫ్యాన్ కింద పడుకోవచ్చు. ఈ సౌకర్యాలు అన్ని చూసి అబ్బో నేను అదృష్టవంతున్ని అని అనుకున్నాను. ఒకరోజు రాత్రి నిద్రపట్టక ఏం తోచక వీళ్ళ గురించి ఆలోచించాను అసలు వీళ్ళు ఏం చేస్తున్నారని. ఇలా దొంగతనం చేసి తీసుకొచ్చిన బంగారాన్ని ఏం చేస్తారో అని రెండు రోజులు బాగా ఆరా తీసి ఆలోచిస్తే తెలిసింది. ఏంటంటే ఇలా మా చేత బంగారం నగలు దొంగతనం చేపిస్తారు. ఆ తర్వాత వాటిని తీసుకొచ్చి మా బాస్ కి ఇస్తే అతను సేటుకి ఇస్తాడు. ఆ సేటేమో వాటిని కరగపెట్టి వేరే నగలుగా తయారుచేసి అమ్మేవాడు. అప్పటికి కానీ తెలియదు నేను చేస్తున్నది ఎంత పెద్ద తప్పు అని. ఇవన్నీ తెలుసుకుని నేను ఒక పోలీస్ ఆఫీసర్‌కి చెప్పాను. ఆ తర్వాత నాకు తెలిసిన విషయం ఏంటంటే ఆ పోలీస్ కూడా వీళ్ళ మనిషే అని. "ఆ తర్వాత ఏమైంది అన్న" అని శంకర్ ఆత్రుతగా అడుగుతాడు. ఇంకేం అవుతుంది బాగా మురికిపట్టిన బట్టల్ని బండకేసి ఉతికినట్టు నన్ను చితకొట్టారు. అప్పటివరకు నాకిచ్చిన బట్టలు అన్ని లాక్కొని తరిమేసారు. ఆ తర్వాత మళ్లీ రోడ్డు మీదకు వచ్చేసాను. ఏం చేయాలో, ఎలా బత

## సీరియల్

కాలో అర్థం కాలేదు. ఇంతకుముందు పనిచేస్తున్న హొటల్ వాళ్ళ దగ్గరికి వెళ్లి అడిగితే వాళ్ళు వద్దన్నారు. నీకు నచ్చినప్పుడు వస్తావు లేదంటే వెళ్ళిపోతావు అలా పని చేసే వాళ్ళకి ఇక్కడ మేము పని ఇవ్వలేం అని అన్నారు. ఇక మీదట ఎక్కడికి వెళ్ళను ఇక్కడే ఉంటానులే అని చెప్పితే సరే అని చేర్చుకున్నారు. ఈసారి నాకు జీతం కూడా ఇచ్చేవాళ్ళు భోజనం కూడా ఉంటుంది అని సంతోషించాను. కానీ, అది కూడా మూన్నాళ్ళ ముచ్చట అని ఆ తరువాతే అర్థమైంది. అక్కడ హొటల్లో నాతో పాటు ఒక పెద్దాయన పని చేసేవాడు. ఆయన ఒక రోజు ఏం చేస్తాడంటే ఓనర్ లేని సమయాన డబ్బులు దొంగలించాడు. అది నేను చూశాను. ఆ తర్వాత కాసేపటికి ఓనర్ వచ్చి డబ్బులు ఎక్కడికి పోయాయి అని వెతుకుతుంటే, నేను వెళ్లి చెప్పాను ఆ పెద్దాయన తీసాడని. కానీ ఆ పెద్దాయన ఏం చేశాడంటే ఇన్నాళ్లుగా నీ దగ్గర పని చేస్తున్నాను, నేను ఎందుకు ఆ పని చేస్తాను, ఈ కుర్రోడే తీసుంటాడని నా మీద చెప్పేశాడు. ఓనర్ కూడా అది నిజం అనుకుని నన్ను కొట్టి బయటికి తరిమేసాడు.

(ఇంకా ఉంది)



రచయిత్రీ
ధాత్రి

# పేదలకు మోడీ సర్కారు దసరా కానుక

**- ఉచితంగా ఫోర్టిఫైడ్ బియ్యం**

**- కేంద్ర ప్రభుత్వం కింద ఇప్పటికే అనేక పథకాలు మంజూరు**

భారతదేశంలోని పేద ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ దసరా పండుగకు ఒక ప్రత్యేక కానుకగా ప్రకటించారు. పేద ప్రజలందరికీ ఫోర్టిఫైడ్ బియ్యాన్ని నాలుగు సంవత్సరాల పాటు ఇవ్వాలని అన్ని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా 80 కోట్ల మందికి పైగా పేదలకు రేషన్ ద్వారా ఉచిత ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేసే పథకం ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజనను మరో నాలుగేళ్లపాటు కొనసాగించనున్నట్టు కేంద్ర ప్రభుత్వం4 తెలిపింది. కేంద్ర ప్రభుత్వం పేదలకు గుడ్ న్యూస్ చెబుతూ దసరా కానుక అందించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం 2028 డిసెంబరు వరకు ఉచిత బియ్యం సరఫరా పథకాన్ని (విటమిన్లు కలిపిన ఉచిత ఫోర్టిఫైడ్ రైస్) పొడిగించడానికి ఆమోదించింది. ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12 సమృద్ధిగా అందించడం ద్వారా భారతదేశంలో రక్తహీనత, సూక్ష్మపోషక పోషకాహార లోపాన్ని ఎదుర్కోవడమే ఈ పథకం యొక్క ఉద్దేశం లక్ష్యంగా పేర్కొన్నారు. ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పిఎంజికేఏవైతో పాటు ఇతర సంక్షేమ పథకాలతో సహా ప్రభుత్వ అన్ని పథకాల కింద పంపిణీ చేయాలని సూచించింది. ఈ ఏడాది జులై 2024 నుండి సార్వత్రిక ఉచిత బలవర్ధక బియ్యాన్ని అందించడం ప్రారంభించింది. ఈ బియ్యం పథకాన్ని డిసెంబర్ 2028 వరకు కొనసాగించడానికి ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

**ఫోర్టిఫైడ్ రైస్ అంటే ఏమిటి?**
**రేషన్‌లో ఇస్తున్నవి ఇవేనా?**

సాధారణ బియ్యాన్ని పిండిలా చేసిన తర్వాత వాటికి అవసరమైన మోతాదులో విటమిన్లను, ఖనిజాలను కలుపుతారు. మళ్లీ వీటిని బియ్యంగా మారుస్తారు. ఈ గింజలనే ఫోర్టిఫైడ్ రైస్ (ఫోర్టిఫైడ్ కెర్నల్స్) అంటారు. దేశంలోని అన్ని ప్రాంతాల్లో ప్రస్తుతం ఫోర్టిఫైడ్ రైస్‌ను అందివ్వడం లేదు. కొన్ని ప్రాంతాల్లో ఫైలట్ ప్రాజెక్టుగా కొనసాగుతోంది. ఏప్రిల్ 2022లో ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిర్ణయం మేరకు మార్చి 2024 నాటికి దశలవారీగా దేశవ్యాప్తంగా బియ్యం బలపరిచే కార్యక్రమాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు పూర్తిగా పోర్టీఫైడ్ రైస్ ను అందించాలని అందుకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాల ప్రకారం పీఎంజీకేఏవై, (ఆహార సబ్సిడీ)లో భాగంగా ప్రభుత్వం 100 శాతం కేంద్ర నిధులతో కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో మరో నాలుగేళ్లు అంటే 2028 వరకు కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. దేశ పేద జనాభాలో రక్తహీనత, సూక్ష్మపోషక పోషకాహార లోపాన్ని పరిష్కరించడానికి, ఆహార బలపరిచేటటువంటి సురక్షితమైన, సమర్థవంతమైన చర్యగా ప్రపంచవ్యాప్తంగా దీనికి ప్రశంసలు ఉన్నాయి. భారతదేశంలో బియ్యం సూక్ష్మపోషకాలను సరఫరా చేయడానికి బియ్యం అనువైన వారది.. ఎందుకంటే జనాభాలో 65 శాతం మంది దీనిని ప్రధాన ఆహారంగా వినియోగిస్తున్నారు. సాధారణ బియ్యం (కస్టమ్ మిల్లింగ్ రైస్)కు ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం సూక్ష్మపోషకాలు (ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12)తో సమృద్ధిగా ఉన్న ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ (ఎఫ్ఆర్‌కె)ను రైస్ ఫోర్టిఫికేషన్‌లో చేర్చడం జరుగుతుంది. ఏప్రిల్ 2022లో ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ మార్చి 2024 నాటికి దశలవారీగా దేశవ్యాప్తంగా బియ్యం బలపరిచే కార్యక్రమాన్ని అమలు చేయాలని నిర్ణయించింది.మూడు దశలు విజయవంతంగా పూర్తయ్యాయనీ, మార్చి నాటికి ప్రభుత్వ పథకాలన్నింటిలో ఫోర్టిఫైడ్ బియ్యాన్ని సరఫరా చేసేందుకు సార్వత్రిక కవరేజీ లక్ష్యంగా పెట్టుకునేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దేశంలో పోషకాహార భద్రత ఆవశ్యకతపై 75వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ చేసిన ప్రసంగానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. రక్తహీనతను పరిష్కరించడానికి "టార్గెటెడ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ ఇతర సంక్షేమ పథకాలు, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీస్ ఐసిడిఎస్, పీఎం పోషణ అంతటా బలవర్థకమైన బియ్యం సరఫరా" వంటి కార్యక్రమాలు కొనసాగించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇటీవలి జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ఎన్ ఎఫ్ హెచ్ఎస్ ప్రకారం, రక్తహీనత భారతదేశంలో విస్తృతమైన సమస్యగా మిగిలిపోయింది. వివిధ వయస్సుల సమూహాలు, ఆదాయ స్థాయిలలో పిల్లలు, మహిళలు, పురుషులను ప్రభావితం చేస్తుంది.ఈ పథకం ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజనతో సహా ప్రధాన ప్రభుత్వ కార్యక్రమాలను కవర్ చేస్తుంది. నాలుగు సంవత్సరాల పాటు ఈ పథకం అమలులో ఉంటుంది. రక్తహీనత, పోషకాహార లోపాలను తగ్గించే లక్ష్యంతో బలవర్థకమైన బియ్యం పంపిణీకి చొరవగ కేంద్ర ప్రభుత్వం 100 శాతం నిధులు సమకూరుస్తుందని ఆ ఉత్తర్వులు పేర్కొన్నారు. ఈ పథకం దేశవ్యాప్తంగా బియ్యం బలవర్ధకానికి ఏకీకృత వ్యవస్థను నిర్ధారిస్తుంది. ప్రభుత్వ నిర్ణయంతో సుమారు 80 కోట్ల మంది పౌరులకు ప్రయోజనం చేకూరుస్తుంది.



**ఏపీలో 1.80 కోట్ల పేదలకు ఉపయోగం..**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దారిద్రరేఖకు దిగువగా ఉన్న పేదలందరికీ ఈ ఫోర్ట్ ఫైట్ బియ్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో సుమారు 1.80 కోట్ల ప్రజలకు ప్రధాన మంత్రి పథకం కింద అందించే బియ్యం ఉపయోగపడనున్నాయి. ఇంకా అర్హులైన వారు ఉంటే కార్డు దరఖాస్తు చేసుకోవాలని నూతనంగా సూచించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా కొత్తగా రేషన్ కార్డులు జారీకి నోటిఫికేషన్ జారీ చేయనుంది. అర్హులైన కుటుంబాల సభ్యులు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవడానికి వారికి ప్రభుత్వ అవకాశం ఇస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అనేక పథకాలను పేద ప్రజలకు అందజేస్తుంది. విశ్వకర్మ పథకం కింద చేతివృత్తుల వారికి కూడా ఆర్థిక సహాయం అందిస్తుంది. వాత్సల్య పథకం కింద తల్లిదండ్రులు లేని విద్యార్థులకు నెలకు నాలుగు వేల రూపాయల కింద ఆర్థిక సహాయం అందించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.



**ఎస్.జయప్రకాశ్**
**సీనియర్ జర్నలిస్ట్**
**నంద్యాల**

# ఉత్సాహపూర్వకంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**అశ్వాపురం అక్టోబర్ 11 జనస్వరం :** అశ్వాపురం మండలం, మల్లెలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యాసంవత్సరంలో పదవ తరగతిని పూర్తిచేసిన విద్యార్థులు, 20 సంవత్సరాల అనంతరం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాలలో స్థిరపడిన ఈ విద్యార్థులు, పాఠశాలలో కలుసుకొని తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, ఆనందంగా ఒకరి పరిచయాన్ని మరొకరికి తేచి సమయాన్ని సంతోషంగా గడిపారు. సమ్మేళనం సందర్భంగా విద్యార్థులు తమ విద్యా బుద్ధులకు పునాది వేసిన గురువులను శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు. గురువుల కృషి, త్యాగాల ఫలితంగా తాము జీవితంలో స్థిరపడిన తీరు గురించి వారు స్మరించుకున్నారు. ప్రత్యేకంగా, పాఠశాలలో చాలా కాలం పాటు అటెండర్‌గా విధులు నిర్వహించిన సిబ్బందిని కూడా గౌరవిస్తూ, వారిని జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ అనుభవాలు పంచుకుంటూ, పాఠశాల అంటేనే స్మృతులను మళ్లీ తెస్తుందని, ఈ సమ్మేళనం వారికి ఒక ప్రత్యేకమైన అనుభూతిని కలిగించిందని తెలిపారు. తమ విద్యార్థి దశలోని అనేక సంఘటనలను గుర్తుచేసుకుంటూ, పాఠశాల మరియు వారి గురువుల సహకారం వల్లే వారు తమ జీవితంలో ఉన్నత స్థానాలను చేరగలిగామని వారు వ్యక్తం చేశారు. ఈ సమ్మేళనం భవిష్యత్తులో మరిన్ని తరాల విద్యార్థులకు ఒక స్ఫూర్తిగా నిలుస్తుందని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల మధ్య సాన్నిహిత్యం పెంపొందిస్తాయని వారు అభిప్రాయపడ్డారు.



# రతన్ టాటాకు నచ్చిన "కడియం కుర్రాడు"- ఏడేళ్లుగా ఈమెయిల్ పరిచయాలు

## - మూడుసార్లు ఆయనతో భేటీ

**కడియం, ఆక్టోబర్ 11 (జనస్వరం) :** ఆరు లక్షల కోట్ల రూపాయల సంస్థకు అధిపతి రతన్ టాటాను స్వయంగా చూసినవారే అరుదుగా ఉంటారు. ఇక ఆయనతో కలిసి ఫోటో తీయించుకోవడం పెద్ద అదృష్టంగా భావిస్తుంటారు. అటువంటి ప్రపంచ పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా తూర్పుగోదావరి జిల్లా కడియంకు చెందిన ఓ పాతికేళ్ల కుర్రాడిని ఇష్టపడ్డాడు అంటే నమ్మడం కాస్త కష్టంగానే ఉంటుంది. కాని ఇది వాస్తవం. అలాగని కడియం నర్సరీ మొక్కలు కొనుగోలు సందర్భంలో ఈ పరిచయం ఏరగపడిందనుకుంటే పొరపాటే. రతన్ టాటాకు ఉన్న ఎన్నో విభిన్నమైన అభిరుచులకు దగ్గరగా ఉండడమే ఈ కుర్రాడు ఆయనకు ఇష్టుడు అయ్యాడు. ఏడేళ్లుగా వారిరువురూ ఈమెయిల్ మెసేజ్ ల ద్వారా పరిచయాలు పెంచుకున్నారు. రతన్ టాటా అభిరుచులకు అనుగుణంగా ఈ కుర్రాడు మెసేజ్ లు, బొమ్మలు పంపించడమే ఇందుకు కారణంగా పేర్కొవచ్చు.



### పర్యావరణ ప్రేమికులు రతన్ టాటా

రతన్ టాటా అంటే పారిశ్రామంగా అభివృద్ధి చెందడంతో పాటు ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం గురించే మనందరికీ తెలుసు. కాని వీటితోపాటు పర్యావరణం అంటే ఈయనకు పట్టరాని అభిమానం. ఈ సృష్టిలో ప్రతి జీవరాశి సుఖంగా జీవించాలనే ఆలోచనలో ఈయన ఉంటారు. అందుకు తగిన సహాయ సహకారాలు అందిస్తారు కూడా. అంతరించిపోతున్న ఎన్నో జాతుల మనుగడకు పాటుపడుతుంటారు. అయితే కడియం మండలం కడియపులంక గౌతమి నర్సరీ యువ రైతు మార్గాని వెంకట శేషు ఎంబీఏ చదువుకునే సమయంలో అన్ని రంగాల్లోనూ రతన్ టాటా ఉండడాన్ని గుర్తించారు. దీంతో అసలు రతన్ టాటా అభిరుచులు ఏంటి అనేదానిపై ఆరా తీయడం మొదలుపెట్టారు. ఆయన మొక్కలతో పాటు పశుపక్షాదులపై ఎలాంటి అభిమానాన్ని చూపెడతారనేది అవగాహన చేసుకున్నారు. దీంతో రతన్ టాటా అభిరుచులకు అనుగుణంగా కొన్ని కొటేషన్లను తయారుచేసి ఆయన పెర్సనల్ ఈమెయిల్ కు శేషు మెసేజ్ చేస్తుండే వారు. 2017 కాలం నుంచి ఈ మెసేజ్ లు పంపడం ప్రారంభించారు. వాటిల్లో కొన్ని నచ్చడంతో పర్సనల్ సెక్రటరీలు రతన్ టాటాకు చూపించడం మొదలు పెట్టారు. అలా కొద్ది రోజులు గడిచేసరికి ఆయనను మరింత ఆకట్టుకునేలా కొన్ని బొమ్మలు వేయించి ఈ కుర్రాడు పంపించారు. అవి రతన్ టాటా కు అమితంగా నచ్చాయి. అందుకనే ఈ కుర్రాడు పంపే మెసేజ్ లు, బొమ్మలను తరచూ చూస్తూ ఉండేవారు. ఈ క్రమంలో ఆయనను స్వయంగా కలవాలనే శేషు కోరికను రతన్ టాటా పరివేక్షక బృందం అవకాశం ఇచ్చారు. శేషు పుట్టిన రోజున ఆయన ఆశీస్సులు తీసుకునే అదృష్టం కలిగింది. ముంబయి రతన్ టాటా బంగ్లాలో శేషు కలయిక రెండు నిమషాలకు అనుమతులు రాగా కలిసిన తర్వాత మరింత సమయం రతన్ టాటా ఈ కుర్రాడుతో గడిపారంటే శేషుపై ఉన్న అభిమానం ఎలాంటిదో స్పష్టమవుతుంది.

### అమ్మ చేసిన లడ్డూను రతన్ టాటా ఇష్టపడ్డారు

చిన్న వయసులో రతన్ టాటా అభరుచులకు అనుగుణంగా ఉండడం వల్ల తనను ఎంతగానో అభిమానించారని శేషు తెలిపారు. రెండు ఏళ్ల క్రితం మా అమ్మానాన్నలు మిమ్మల్ని చూడాలని కోరుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లగా వెంటనే అవకాశం కల్పించారన్నారు. అయితే తల్లిదండ్రులు వీరబాబు, సత్ లు రావాల్సిన విమానం అనివార్య కారణాల వల్ల ఆలస్యమైంది. దీంతో ఆయన మాకు ఇచ్చిన సమయానికి వెళ్ళలేని పరిస్థితి. అయితే ఈ విషయాన్ని ఆయన దిష్టి తీసుకెళ్లగా గంటన్నర ఆలస్యం అయినప్పటికీ వారిని కలుసుకునే అవకాశం ఇచ్చారు. ఇటువంటి కుమారుడు ఉండటం మీ అదృష్టమని తనను కొనియాడారని శేషు తెలిపారు. ఇదిలా ఉండగా ఆయన డ్రై ఫ్రూట్ లడ్డూలను ఇష్టంగా తింటారని తెలిసి మా అమ్మతో తయారు చేయించి పంపించగా వాటిని తిని బాగున్నాయని మెసేజ్ పంపినట్లు తెలిపారు. ఈ ఏడాది జనవరిలో రతన్ టాటా ను కలిసినప్పుడు ఎంతో ఆరోగ్యంగా ఉన్నారని ఆయన అనారోగ్యానికి గురయ్యారనే వార్తలు రావడంతో ఆయన కార్యాలయానికి ఫోన్ చేసి అడగ్గా త్వరలోనే కోలుకుంటున్నారని చెప్పారని ఇంతలో ఇలా జరగడం బాధాకరమని శేషు తెలిపారు. ఆయన భౌతికంగా లేకపోయినప్పటికీ ఆయన ఆశయాలు సజీవంగా ఉంటాయని, ఆయనలేని లోటు నాకు మాకుటుంబానికి తీరనదని శేషు కన్నీటి పర్యంతమై తెలిపారు.

# జిఓ నెంబర్ 177రద్దు చేయాలి : జన విజ్ఞానవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు

**చీరాల, అక్టోబర్ 11, జనస్వరం :** తెలుగు మీడియం రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ నెంబర్ 117 ను రద్దు చేయాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జిఓ భవన్‌లో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27న జిల్లా స్థాయి చెకుముకి ప్రతిభా పరీక్ష దేశాయిపేట ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులు నవంబర్ 9, 10 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో విద్య, వైద్యం, సాంస్కృతికం, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆరోగ్యం వంటి అంశాలపై చర్చించారు. ఆయా రంగాల జిల్లా కన్వీనర్లను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన విద్యా విధానం వల్ల ప్రాథమిక విద్యను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం కారణంగా బడిమానేసే విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. తెలుగు మీడియం లేని కారణంగా, విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని వ్యాఖ్యానించారు. జీవో 117 రద్దు చేయాలని ఆయన కోరారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వల్ల ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే తరాలకు ఆరోగ్యవంతమైన వాతావరణం అందించడానికి అందరూ బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు. పాఠశాలల్లో విద్యార్థులకు గురజాడ అప్పారావు వంటి కవుల రచనలపై శిక్షణ ఇచ్చి దేశభక్తి భావాన్ని పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షులు, ప్రధాన




కార్యదర్శులు వై.భాస్కరరావు, తంగ శ్రీనివాసరావు, కోశాధికారి మాల్యాద్రి, డి.నారపరెడ్డి, శ్రీనివాసరావు, రంగారావు, హరిబాబు, దక్షిణామూర్తి, శివన్నారాయణ, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ భవన స్థలాన్ని కబ్జా చేసేందుకు కుట్ర : ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక ఆరోపణ

**రేణిగుంట, అక్టోబర్11 (జనస్వరం) :** తారకరామా నగర్ లో 2018లో అంబేద్కర్ భవనానికి కేటాయించిన 30 సెంట్లు భూమిని కబ్జా చేసేందుకు ప్రస్తుత టిడిపి నాయకులు కుట్ర పన్నుతున్నారని రేణిగుంట మండల ఎస్సీ ఎస్టీ ఐక్యవేదిక సభ్యులు ఆరోపిస్తున్నారు. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారక రామ నగర్ లో రెండు రోజుల క్రితం సమత సైనిదళ్ రాయలసీమ కోఆర్డినేటర్ రెడ్డప్ప టిడిపి నాయకుల మధ్య జరిగిన అంబేద్కర్ భవన స్థల వివాదంలో టిడిపి నాయకులు దళితులపై దాడి చేశారని రేణిగుంట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన ఎటువంటి చర్యలు తీసుకోలేదని నిరసిస్తూ శుక్రవారం రేణిగుంట అంబేద్కర్ విగ్రహం ముందు రేణిగుంట మండల ఎస్సీ ఎస్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. టిడిపి నాయకులపై వెంటనే ఎస్సీ ఎస్టీ కేసును నమోదు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ భవన నిర్మాణానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం చర్చించారు. ఈ సందర్భంగా రెడ్డప్ప మాట్లాడుతూ 2018 లో అప్పటి ఎమ్మెల్యే గోపాలకృష్ణారెడ్డి ని అంబేద్కర్ భవనం కావాలని అందరూ దళిత



నాయకులంతా కలసి అడిగామని అందుకు స్పందించిన మాజీ ఎమ్మెల్యే ఎమ్మార్వో తో మాట్లాడి 30 సెంట్లు భూమిని అంబేద్కర్ భవనం నిర్మాణానికి కేటాయించారని అన్నారు. అప్పటినుంచి ఆ స్థలాన్ని ఎవరు కబ్జా చేయకుండా కాపు కాస్తున్నామని తెలిపారు. స్థానిక టిడిపి నాయకుడు బుజ్జి నాయుడు బాలాజీ తదితరులు ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. అంబేద్కర్ భవన నిర్మాణానికి చేపట్టిన పనులను టిడిపి నాయకులు వచ్చి తనపై దాడి చేశారని ఆ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇంతవరకు చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పుడు కొత్తగా మహిళ భవనం నిర్మిస్తామంటూ స్థానికంగా తన అనుచరులను పెట్టుకొని తనపై దుర్భాషలాడారని ఎటువంటి పరిస్థితుల్లో ఆ స్థలంలో అంబేద్కర్ భవనం తప్ప ఇంకేటువంటి భవనాలు నిర్మాణానికి ఒప్పుకోమని తెలిపారు.ఈ కార్యక్రమంలో తులసిరాజన్, ఐజయ్య,మధు, మురళి,చలపతి,సెల్వ రాజు,ఆంటోని,మురగయ్య, కంజాక్షి కుమార్, మునిరత్నం, కస్తూరి, వాణికుమారి తదితర మహిళలు ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.



# గెలుపే లక్ష్యంగా, కూటమినేతలు పని చేయాలి

**బాపట్ల, అక్టోబర్ 11, జనస్వరం :** త్వరలో జరిగే ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి బలపరచిన మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ కూటమి నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బాపట్ల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మాట్లాడుతూ, ఉన్నత విద్యావంతులైన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీలో దింపిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఏయస్ రామకృష్ణ, బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు బొంతు సాంబిరెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు సలగల రాజశేఖర్ బాబు, రాష్ట్ర కమిటీ నాయకులు తాతా జయప్రకాశ్ నారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జనసేన నాయకులు తులసి కుమారి, టిడిపి పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, తానికొండ దయబాబు, టిడిపి, బీజేపీ, జనసేన కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఇందా దుల్లా ఖాన్



**కదిరి, అక్టోబర్ 11, జన స్వరం :** కదిరి మున్సిపల్ అభివృద్ధి మానుకొని మైనార్టీ చైర్ పర్సన్ నజీ మున్నీష రాజీనామాకు కొందరు కాన్సిలర్లు డిమాండ్ చేయడం సరి కాదని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఇందా దుల్లా హితవు పలికారు. ప్రస్తుతం రాజకీయాల్లో మైనార్టీ చైర్ పర్సన్ చూసి ఓర్వ లేక పోతున్నారని ఆయన ఆయన అన్నారు.ఇప్పటికైనా చైర్ పర్సన్ రాజీనామా మానుకొని కదిరి పట్టణ అభివృద్ధి చేసి ప్రయత్నం చేయాలని హితవు పలికారు.

# జన స్వరం తెలంగాణ

www.janaswaram.com


# దేవి నవరాత్రుల సందర్భంగా శివ సైనిక్స్ ఆధ్వర్యంలో మహా అన్నదానం

**అశ్వాపురం అక్టోబర్ 11 జనస్వరం :** మొండికుంట ప్రధాన రహదారిలో శివ సైనిక్స్ ఆధ్వర్యంలో తొలిసారిగా దేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా, ప్రతి రోజూ అమ్మవారు ప్రత్యేక అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ సందర్భంగా శివ సైనిక్స్ వారు మహా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కళ్యాణ్ బాబు మాట్లాడుతూ, నవరాత్రుల పూజలు ప్రజల ఆయురారోగ్యానికి, సిరిసంపదలకు దోహదపడాలని ఆకాంక్షించారు. రోజు వారీ పూజా కార్యక్రమాలు, హోమాలు భక్తి పరవశంతో జరుగుతున్నాయని తెలిపారు. శుక్రవారం నాడు నిర్వహించిన మహా అన్నదానంలో గ్రామ పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన వారందరికీ కళ్యాణ్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. శివ సైనిక్స్ సభ్యులు, భక్తులందరికీ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుతూ, భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు మరింత వైభవంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.



# రాబోయే మూడు రోజులలో జిల్లాలో భారీ వర్షాలు

## - జిల్లా కలెక్టర్ టీ.ఎస్ చేతన్



**పుట్టపర్తి, అక్టోబర్ 11, జనస్వరం :** రాబోయే మూడు రోజులలో జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎగువ వాయు తుఫాను ప్రసరణ దక్షిణ బంగాళాఖాతం మధ్య భాగాలపై ఉంది మరియు సగటు సముద్ర మట్టానికి 3.1 కి.మీ వరకు విస్తరించి ఉంది. దాని ప్రభావంతో, వాయువ్య దిశలో దాని కదలికను అనుసరించి, ఈ నెల 14 నుండి 16 వరకు దక్షిణ కోస్తా ఏపీ మరియు రాయలసీమలో చాలా చోట్ల, అలాగే ఉత్తర కోస్తా ఏపీ లో 15, 16 తేదీలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అక్టోబర్ 14న రాయలసీమ మరియు దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. అక్టోబర్ 15న తిరుపతి, అన్నమయ్య, నెల్లూరులో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదే రోజు చిత్తూరు, శ్రీ సత్య సాయి, వైఎస్ఆర్ జిల్లా, అనంతపురం, నంద్యాల, ప్రకాశం, బాపట్ల, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అక్టోబర్ 16న శ్రీ సత్య సాయి, అనంతపురం, కర్నూలు, వైఎస్ఆర్ జిల్లా, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, పశ్చిమ గోదావరి ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

# ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు

## - పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు



**పర్చూరు, అక్టోబర్ 11, జనస్వరం :** ప్రజలందరికీ పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబ శివరావు దసరా శుభాకాంక్షలు తెలిపారు. చీకటిపై వెలుగు సాధించిన విజయోత్సవమే ఈ దసరా అని అన్నారు. చెడుపై మంచి, దుష్ట శక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని పేర్కొన్నారు. జగన్మాత ఆశీస్సులతో పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖ శాంతులు, సిరి సంపదలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం పాలనలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా పయనిస్తుందని, రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తూ భవిష్యత్తులో దేశానికి తలమానికంగా నిలుస్తుందని అన్నారు. గత పాలనలో రాష్ట్రం అధోగతికి పాల్పడిందని, ప్రస్తుతం అన్ని శాఖలు ప్రణాళికాబద్ధంగా, విజన్తో ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. దసరా అందరి జీవితాల్లో మార్పు తీసుకురావాలని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిత్యం విజయాలతో అగ్రభాగాన నిలవాలని ఆకాంక్షించారు.

# పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



భైంసా అక్టోబర్ 11 జనస్వరం : పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణ్ రావ్ పటేల్అన్నారు.శుక్రవారం పట్టణ కేంద్రంలో ఆయన నివాసంలో ఏడుగురు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.నారాయణ్ రావ్ పటేల్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో పేదలకు వైద్య ఖర్చుల కోసం డబ్బులను అందించడానికి సీఎం రిలీఫ్ ఫండ్, ఎంతో మేలు చేస్తుందని కోరారు. రైతులకు రైతుబంధు, బీమా, రుణమాఫీ, పేదింటి ఆడపడుచుల వివాహానికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పింఛన్‌లు తదితర అనేక సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. వాటితో పాటు ఆరు గ్యారంటీలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ తదితర పథకాలు ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా అమలు చేస్తున్నామన్నారు. పేదవారికి సీఎం సహాయనిధి ఆపదలో అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ చేంద్రే రామచందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ముత్యం రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంగారెడ్డి,ముధోల్ మండల అధ్యక్షులు శ్రీనివాస్, ముధోల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎస్ కే.నజీమ్ హైమాధ్, పాల్గొన్నారు.

## దెందులూరు ఎస్సైగా శివాజీ బాధ్యతలు స్వీకరణ



**దెందులూరు, అక్టోబర్ 11 (జనస్వరం) :** దెందులూరు నూతన ఎస్సైగా శివాజీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలోని పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎస్సై శివాజీ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తనను సంప్రదించవచ్చని చెప్పారు. ప్రజలతో మమేకమై ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను కాపాడుతామన్నారు . చట్ట విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహించే వారి సమాచారం తనకు అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## భవాని మాలదారులకు అల్పాహారం పంపిణీ



**దెందులూరు, అక్టోబర్ 11 (జనస్వరం) :** భవాని మాలదారులకు అందించే సేవ దేవుని సేవ తో సమానమని కొప్పుల వెలమ సంఘం జిల్లా నాయకులు సంపంగి వేణుగోపాల్ అన్నారు.శుక్రవారం జాతీయ రహదారిపై దెందులూరు వద్ద కొప్పులు వెలమ సంఘం ఆధ్వర్యంలో భవాని మాలదారులకు అల్పాహారం శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దసరా సందర్భంగా కాలినడకన వెళ్లే భావానీ మాలదారులకు దెందులూరు గ్రామానికి చెందిన కొప్పుల వెలమ సంఘం నాయకులు సంపంగి వేణుగోపాల తిలక్ మిరప చిన్నా. రాజేష్ .గోపి. వెంకటేశ్వరరావు తదితరులు ఆధ్వర్యంలో భవాని మాలదారులకు అల్పాహారం త్రాగునీరు మజ్జిగ ప్యాకెట్లు భోజనం పులిహోర ఇడ్లీతోపాటు పలు రకాల అల్పాహారాన్ని అందించారు.

## అన్నపై తమ్ముడు గొడలితో దాడి



**సీలేరు, అక్టోబర్ 11, జనస్వరం :** అన్నపై తమ్ముడు గొడ్డలి కర్రతో దాడి చేసిన ఘటన అల్లూరి జిల్లా జికే వీధి మండలం దుప్పులవాడ పంచాయతీ శాండికోరి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. సీలేరు ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం, శాండికోరి గ్రామానికి చెందిన వంతల నందు గతంలో తన భార్యను హత్య చేసిన కేసులో 14 సంవత్సరాల జైలు శిక్ష అనుభవించి కొన్నేళ్ల క్రితం విడుదలయ్యాడు. అప్పటినుండి ఊరిలో చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే సమయంలో, నందు తన సొంత అన్న అజ్జు భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం తెలిసిన అజ్జు తమ్ముడు నందును నిలదీయగా, అన్నదమ్ముల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ గొడవలో నందు, గొడ్డలి కర్రతో అన్న అజ్జుపై దాడి చేసి, అతడి రెండు చేతులకు గాయాలు చేశాడు. స్థానిక ఆశా వర్కర్ ద్వారా సమాచారం అందగా, గాయపడిన అజ్జును అర్జుని సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ డాక్టర్ మస్తాన్ వల్లి, డాక్టర్ సౌమ్య అతనికి ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం చింతూరు ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు రావడంతో నిందితుడు నందుపై కేసు నమోదు చేసినట్లు, పరారీలో ఉన్న నందును పట్టుకునేందుకు గాలిస్తున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

## భక్తి శ్రద్ధలతో మహిసురవర్థ్ని శరన్నవరాత్రి ప్రత్యేక పూజలు



**వేటపాలెం, అక్టోబర్ 11, జనస్వరం :** చీరాల నియోజకవర్గం, వేటపాలెం మండలం, ఆణుమల్లిపేట శ్రీ మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద దేవీ నవరాత్రుల్లో భాగంగా, శ్రీ బతుకమ్మను 9వ రోజు అత్యంత అద్భుతంగా అలంకరించి, ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిషాసుర మర్ధిని స్తోత్రం పారాయణం చేస్తూ, ప్రత్యేకంగా శుక్రవారం కావడంతో మహిళలు ఎంతో భక్తి, శ్రద్ధలతో అమ్మవారికి పొంగళ్లను నివేదించి, అమ్మవారిని కొలిచారు. ఈ సందర్భంగా, వేటపాలెంలోని పెద్ద వారిని సుహాసినిలుగా కొలుచుకుని, వారికి పాద పూజ చేసి ఎంతో సంతోషంగా పసుపు కుంకుమ అందజేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలను భక్తులకు అందించారు. ఈ కార్యక్రమంలో చుండూరు రాజ్యలక్ష్మి, ప్రత్తి అనంతలక్ష్మి, కోడూరు రాజేశ్వరి, స్రవంతి, పెనుగొండ సత్యవాణి, కోమలి దేవి, ఆత్మకూరి లత మౌనిక, ప్రత్తి పుణ్యవతి, కోడూరి ధనలక్ష్మి, దుడ్డు ధనలక్ష్మి, దొగుపర్తి ధనలక్ష్మి, జవ్వాజి లక్ష్మీ, పొన్నూరు మల్లిక తదితర మహిళలు పాల్గొన్నారు.

## నల్లపురెడ్డి పల్లెలో ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన



**పులివెందుల అక్టోబర్ 11, జనస్వరం :** పులివెందుల మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో, టీడీపీ యువ నాయకుడు కడపన యోగానంద రెడ్డి, అనంతపురంలోని ప్రముఖ కిమ్స్ సవేరా హాస్పిటల్ సంయుక్తంగా ఉచిత గుండె వైద్య పరీక్షల శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని టీడీపీ వేముల మండల ఇన్‌చార్జ్ మారెడ్డి జోగి రెడ్డి, టీడీపీ పులివెందుల పట్టణ మాజీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు. మొత్తం 200 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు, వీరికి బి.పి, ఇసిజి, 2డి-ఎకో, 2డి స్కానింగ్ వంటి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. వీరిలో ఆరోగ్య సమస్యలు ఎక్కువగా ఉన్నవారిని అనంతపురంలోని కిమ్స్ సవేరా హాస్పిటల్‌కు రిఫర్ చేస్తున్నట్టు డాక్టర్ రామ్ కుమార్ తెలిపారు. అనంతరం టీడీపీ వేముల మండల ఇన్‌చార్జ్ మారెడ్డి జోగి రెడ్డి, టీడీపీ పులివెందుల పట్టణ మాజీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ, కిమ్స్ సవేరా హాస్పిటల్ వారు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన నల్లపురెడ్డిపల్లె టీడీపీ నాయకులు నంద్యాల జయరామి రెడ్డి, టీడీపీ యువ నాయకుడు కడపన యోగానంద రెడ్డికి మరియు ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిఎం ఆంజనేయులు, వేముల మండలం వెలుగు సిసి కోనా హరికృష్ణ, జయరాం రెడ్డి, మస్తాను, శివగంగాధర, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి క్రీడాకారులకు మహిళా వైద్యుల ఆర్థిక సహాయం



**నంద్యాల అక్టోబర్ 11 జనస్వరం :** ఈనెల 14వ తేదీ నుండి గోవా రాష్ట్రంలోని వాస్కోడిగామా రవీంద్ర భవన్ లో నిర్వహించనున్న జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొంటున్న నంద్యాల పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులకు ఐఎంఏ నంద్యాల మహిళా వైద్యులు శుక్రవారం ఆర్థిక సహకారం అందజేశారు. ఐఎంఏ నంద్యాల మిషన్ పింక్ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో, రాష్ట్ర మిషన్ పింక్ హెల్త్ కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ సౌజన్య, నంద్యాల మిషన్ పింక్ హెల్త్ విభాగం అధ్యక్షురాలు డాక్టర్ నెరవాటి అరుణకుమారి ల నిర్వహణలో స్థానిక ఐఎంఏ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు తరపున పాల్గొంటున్న నంద్యాల క్రీడాకారులు పల్లవి, మహేష్ ,నరసింహ లకు పదివేల రూపాయల ఆర్థిక సహకారం అందించారు. ఐఎంఏ జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యులు,రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, ఐఎంఏ అధ్యక్షురాలు, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి డాక్టర్ వసుధ రాణి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ ఐఎంఏ చేస్తున్న వివిధ సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా ఈరోజు రాష్ట్రం తరపున పాల్గొంటున్న క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఈ సహకారం అందజేశామన్నారు. డాక్టర్ లక్ష్మీ సౌజన్య మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలలో ప్రతిభ చూపి పతకాలు సాధించి ఏపీ రాష్ట్రానికి దేశంలో కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని శుభాకాంక్షలు తెలిపారు. క్రీడలను ప్రోత్సహించటం వలన వారిలో ఆసక్తిని పెరుగుతుందన్నారు. క్రీడలతో పాటు చదువు కూడా విద్యార్థులు చాలా ముఖ్యమని పేర్కొన్నారు. క్రీడలు వాట మూలంగా మానసిక ఉల్లాసము ఆరోగ్యము ఆనందదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మిషన్ పింక్ హెల్త్ కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ సౌజన్య, ఐఎంఏ నంద్యాల ఉపాధ్యక్షురాలు డాక్టర్ మాధవి, మిషన్ పింక్ హెల్త్ విభాగం గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ నాగమణి,అధ్యక్షురాలు డాక్టర్ అరుణకుమారి,మహిళా విభాగం గౌరవాధ్యక్షురాలు డాక్టర్ నర్మద , పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు పల్లవి ,మహేష్, నరసింహ పాల్గొన్నారు.

## మహిషాసుర మర్ధిని దేవిగా శ్రీ కట్టపుట్టలమ్మ



**రేణిగుంట, అక్టోబర్11 (జనస్వరం) :** రేణిగుంట మండలం కరకంబాడి గ్రామంలో వెలసిన శ్రీ కట్ట పుట్టలమ్మ దేవాలయంలో జరుగుతున్న దసరా శరనవరాత్రులు ఉత్సవాలలో భాగంగా 10వ రోజు శ్రీ కట్ట పుట్టలమ్మ అమ్మవారు శ్రీ మహిషాసుర మర్దిని దేవి గా దర్శనమిచ్చారు.శుక్రవారం తెల్లవారుజామున ఆలయ పూజారులు విశేష అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని శోభాయ మానంగా అలంకరించారు. దేవి శరనవరాత్రులలో విశిష్టమైన శుక్రవారం కావడంతో మహిళ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఖయా కర్పూరం సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ వంశపారపర్య ధర్మకర్త కూరకాలువ రామచంద్రయ్య కుమారుడు కురకాలువ వాసు అమ్మవారికి జరిగిన ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఆలయ నిర్వహకులు భక్తులకు తీర్ధ ప్రసాదాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ స్వయంబుగా వెలసిన శ్రీ కట్ట పుట్టాలమ్మ తల్లి ఆలయంలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లు ఈ సంవత్సరం కూడా దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.తొమ్మిది రోజులు అమ్మవారు వివిధ రూపాలలో భక్తులను కటాక్షించారని అన్నారు. శనివారం జరిగే దసరా మహోత్సవంలో ప్రతి ఒక్కరు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## మహిషాసుర మర్దిని అలంకరణలో అమ్మవారు



**రేణిగుంట, అక్టోబర్11 (జనస్వరం) :** రేణిగుంట మండలం రామకృష్ణాపురం గ్రామంలో వెలసిన శ్రీ అంకాల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రులు ఉత్సవాలలో శుక్రవారం శ్రీ మహిషాసుర మర్దిని రూపంలో అమ్మవారు భక్తులను కటాక్షించారు. తెల్లవారుజామున ఆలయ పూజారి మునస్వామి అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించి శ్రీ మహిషాసుర మర్దిని ప్రతిరూపంగా శ్రీ అంకాల పరమేశ్వరి అమ్మవారిని అలంకరించారు. అమ్మవారికి ఎంతో ఇష్టమైన శుక్రవారం అవడంతో గ్రామంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఉభయ దారులు, ఆలయ నిర్వహకులు భక్తులకు తీర్ధ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కుట్రపాకు మునికృష్ణ,కమిటీ సభ్యులు చంద్రయ్య, గురవయ్య,ప్రసాద్, సుబ్బయ్య, వినోద్, రాము, రాజా హరి, రాఘవేంద్ర, జయరామయ్య, శీను,రవి, హేమనాథ్ ఉభయ దారులు పాల్గొన్నారు.

## పురవీధుల గుండా దుర్గామాత గ్రామోత్సవ కార్యక్రమం

### - చండీ హోమంలో పాల్గొన్న అత్యధిక భక్తులు

**నంద్యాల, అక్టోబర్ 11, జనస్వరం :** నవరాత్రుల్లో చివరి రోజు అయినా దుర్గామాత ఉత్సవాలను నంద్యాలలో ఘనంగా నిర్వహించారు. స్వస్తి శ్రీ క్రోధి నామ సంవత్సర ఆశ్వీయుజ శుద్ధ అష్టమి శుక్రవారం నంద్యాల సంజీవ్ నగర్ రామాలయంలో దసరా శరన్నవరాత్రులలో భాగంగా లోకకల్యాణార్థం చండీ హోమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీ భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. సకల చరాచర జగత్తును తన చల్లని చూపులతో జగన్మాత ఆదిపరాశక్తి భక్తకోటి మీద ప్రసరించాలని సదుద్దేశంతో "కలౌ చండీ వినాయకౌ" అనే ఆర్యోక్తి ఆధారంగా, కలియుగంలో కోరికలు తీర్చగల కల్పవృక్షం వలె "చండీ హోమం" అమ్మ ఆజ్ఞ ప్రకారం సంకల్పించామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 11 హోమగుండాలలో 58 జంటలతో చండీ యాగం స్మార్త పండిట్ శ్రీ యాదవల్లి కార్తికేయ శర్మ ఆధ్వర్యంలో శ్రీ భగవత్ సేవా సమాజ్ నిర్వహణలో జరిగింది. పూర్ణాహుతి కార్యక్రమం మధ్యాహ్నం 12.37 గంటలకు ముగిసింది. వచ్చిన భక్తులందరికీ తీర్థ ప్రసాదం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. చండీ హోమానికి విచ్చేసిన భక్తులందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం 6 గంటలకు నంద్యాల సంజీవ్ నగర్, శ్రీనివాస నగర్ పురవీధుల గుండా దుర్గామాత గ్రామోత్సవం జరిగింది. వేలాదిగా భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం పొందారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవ సందర్భంగా, శ్రీమతి కశెట్టి సుబ్బమ్మ బాలాజీ మర్చంట్స్ కమిటీ కళ్యాణ మండపం ఆలయంలో నవరాత్రి నవమి రోజు, శుక్రవారం రాజ రాజేశ్వరి దేవి అలంకారంతో దుర్గామాతను పూజించారు. భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు.





## ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

**రేణిగుంట, అక్టోబర్11 (జనస్వరం) :** అక్టోబర్ 11 న అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పేడు మండలం చింతలపాలెం గ్రామం నందు ఘనంగా నిర్వహించారు. ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రగతి సంస్థ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ కె.నారాయణ మాట్లాడుతూ సమాజంలో ఆడబిడ్డలపై ఉండే వివక్షతను హింసను బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం అక్టోబర్ 11వతేది అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహిస్తారని తెలిపారు.ప్రతి అమ్మాయికి, ఆమె నేపథ్యం లేదా పరిస్థితితో సంబంధం లేకుండా, ఆరోగ్యసంరక్షణ, విద్య, ఉద్యోగ రంగాల్లో సమాన అవకాశాలుండాలి. బాలికలకు సాధికారత కల్పించాలి. తద్వారా సమాజానికి ఎంతో మేలు అని ఈ సందర్భంగా అన్నారు. అంగన్వాడీ సూపర్వైజర్ రత్నమ్మ మాట్లాడుతూ ఆడబిడ్డల




ప్రాముఖ్యతను సమాజానికి చాటి చెప్పేందుకు బాలికలు తమ లక్ష్యాన్ని చేరుకోవడానికి వారి ముందున్న సవాళ్లపై దృష్టి సారించి ముందుకు వెళ్లాలని కోరారు. ఏర్పేడు మండల కో ఆర్డినేటర్ శిరీష మాట్లాడుతూ ప్రతీ ఏటా అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఒక ప్రత్యేక థీమ్‌తో నిర్వహిస్తుంటారు. ఈ ఏడాదికిగాను భవిష్యత్ కోసం బాలికల విజన్ థీమ్‌తో నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. ఈ దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలికలకు సంబంధించిన స్ఫూర్తిదాయకమైన కథనాలను వీడియోలను అందరితో పంచుకోని సమాజంలో వారికి ఉన్నత స్థానం కల్పించవలసిన భాద్యత ప్రతి ఒక్కరిది అని తెలిపారు. ఈ సమావేశంలో ప్రగతి సిబ్బంది మురగయ్య, సురేష్, గ్రామ ప్రజలు మొదలగు వారు పాల్గొన్నారు.



## మొక్కలను చదివిన వృక్ష శాస్త్రవేత్తలు కడియం నర్సరీ రైతులు

**కడియం, అక్టోబర్ 11 (జనస్వరం) :** కడియం ప్రాంత రైతులు పీహెచ్డీ చేయని, మొక్కలను చదివిన వృక్ష శాస్త్రవేత్తలని, కొత్త రకాల మొక్కలను ఉత్పత్తి చేయడంలో వీరికి సాటి ఎవరు లేరనడంలో ఎటువంటి సందేహం లేదని, నర్సరీలలో కొత్తగా రూపకల్పన చేసిన మొక్కలను పరిశీలిస్తేనే తెలుస్తుందని గుంటూరు రేంజ్ ఎన్. సి. సి లెఫ్టినెంట్ డాక్టర్ మంజుశ్రీ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా గల 28 రాష్ట్రాల రేంజ్ ఎన్. సి.సి క్యాడర్స్, 3 వందల మంది ఎం.సి.సి ట్రైనీ విద్యార్థులు కడియం మండలం కడియపులంక శ్రీ సత్యదేవా, శ్రీ శివాంజనేయ నర్సరీలను సందర్శించారు. ఈ నర్సరీల మేనేజింగ్ డైరెక్టర్లు పుల్లా పెద్ద సత్యనారాయణ, మల్లు పోలరాజు నర్సరీలలో ఉత్పత్తి అయ్యే వివిధ మొక్కల ప్రాధాన్యతను వివరించారు. ప్రకృతిలో వాతావరణం సమతుల్యం చేసే మొక్కలతో పాటు వివిధ రకాల ఔషధ, పండ్ల జాతి మొక్కల విశిష్టతను, వాటి శాస్త్రీయ నామాలను వివరించారు. ప్రపంచంలోనే ఎక్కడా లేని ప్రకృతి అందాలు ఈ ప్రాంతంలో కొని విందు చేస్తున్నాయని, ఈ ప్రాంతంలో ఉత్పత్తి అయ్యే మొక్కలు మరి ఎక్కడ చూడలేదని, అంతర్జాతీయంగా లభ్యమయ్యే మొక్కలు అన్ని ఈ ప్రాంతంలో ఈ నర్సరీలలో రూపకల్పన చేయడం చాలా అభినందనీయమని ఎన్సిసి అధికారులు తెలిపారు. 40 ఏళ్ల నాటి నుండి అడుగు ఎత్తులో చిన్న కుండిలో పెరిగిన మొక్కలను చూసి వారు ముద్దులయ్యారు. ఔషధాలకు కావలసిన మొక్కలు కూడా ఇక్కడే ఉత్పత్తి చేయడం నర్సరీ రైతుల పరిజ్ఞానాన్ని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెనుమాక కొండబాబు, గాద నాగేశ్వరరావు, తడాల బాల మురళి కృష్ణ , గట్టా కృష్ణ భగవాన్, రావిపాటి రామకృష్ణ, జంగా సుబ్బారావు, అడ్డగర్ల రమేష్, గాజుల రత్తయ్య, తాడాల నాగేశ్వరరావు, పిల్లా శ్రీనివాసరావు, కొండేపూడి నాగు, వడ్లమూరి రాజేష్ పాల్గొన్నారు.



Owned by : Sake Naresh (Chairman) - 9642067900, Managed by : Jammu Sai Kalyan (Managing Director) - 7013030690, Mahendra (Sub editor) - 9866140211
REGD NO :APTEL 16144, Mail Id : janaswaramnews@gmail.com Dr.no : 9-35-4A, Illipilli Narasimha Rao Street, Opp KBN College, Kothapeta, Vijayawada - 520001.

# జమల్ ఖాన్ చారిటబుల్ సంస్థ ద్వారా బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

**వి.ఆర్.పురం అక్టోబర్ 11 జనస్వరం :** మండలంలోని బీసీ కాలనీకి చెందిన తుంగ రాంబాబు (48) అనారోగ్య సమస్యతో మరణించడం జరిగింది. మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యులకు జమాల్ ఖాన్ చారిటబుల్ సంస్థ సభ్యులు, టిడిపి నాయకులు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి జె కె సి టీ సంస్థ ద్వారా 5000 రూపాయలు సహాయార్థం అతని భార్య తుంగ ముత్యాలు కు అందజేయడం జరిగింది.

**పాము కాటుకి గుర్రై మరణించిన కుటుంబానికి ఆర్థిక సాయం**

ఇదే గ్రామానికి చెందిన కోట్ల లక్ష్మణరావు (55) పాము కాటుకి గుర్రై మరణించడంతో జె కె సి టీ సభ్యులు, టిడిపి నాయకులు ఈ విషయాన్ని తెలుసుకొని వారి కుటుంబానికి కూడా 5000 రూపాయల సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ముత్యాల రామారావు, బొర్ర నరసింహారావు సిద్దు,ఆదినారాయణ సూరి, రాజు, శంకర్ బింగి విష్ణుమూర్తి గడ్డం కృపారావు తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు.






# పట్టాదారు పాసుబుక్ జాప్యంపై విచారణ

**ముమ్మిడివరం జనస్వరం అక్టోబర్ 11 :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్లో గోదావరి భవనంలో జరిగిన స్పందన కార్యక్రమంలో గత సోమవారం, పట్టాదారు పాసుపుస్తకం మంజూరు జాప్యం గురించి కందికుప్ప శివారు బొజ్జవారి పేటకు చెందిన బొజ్జా విజయ ఫిర్యాదుపై కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించారు. ఈ సందర్భంలో కాట్రేనికోన తహసిల్దార్ సురేష్ కుమార్ స్పందించి, బాధితురాలను కార్యాలయానికి పిలిచి విచారణ జరిపారు. ఆమె రెండు ఎకరాల భూమికి పట్టాదారు పాసుపుస్తకం రాకుండా కొందరు అడ్డుకుంటూ తనకు అన్యాయం చేస్తున్నారని వాపోయింది. అధికార, ధన బలం వల్ల తాను నిస్సహాయంగా మిగిలిపోయి, దయనీయ జీవితం గడుపుతున్నానని, ఇకనైనా పాసుపుస్తకం అందజేసి న్యాయం చేయాలని ఆమె తహసిల్దార్‌ను కోరింది. తహసిల్దార్ కొత్తగా వచ్చిన డిప్యూటీ తహసిల్దార్, ఆర్ఐ, వీఆర్వోలను పిలిచి వెంటనే నోటీసులు జారీ చేసి, పాసుపుస్తకం కోసం అవసరమైన డాక్యుమెంట్లు కలిగి ఉన్న ఫిర్యాదు దారు విజయకు పాసుబుక్ జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండు నెలల్లో పాసుబుక్ మంజూరు చేస్తామని తహసిల్దార్ బాధితురాలైన విజయకు హామీ ఇచ్చారు. ఇన్నాళ్లకు తన పట్టాదారు పాసుపుస్తకం సమస్యపై విచారణ చేసి పరిష్కారం చూపించినందుకు, మండల రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన అధికారుల పట్ల విజయ సంతృప్తి వ్యక్తం చేసింది.

# స్వామి ఒక్క పొద్దులకు తరలి రండి

**అమడగూరు, అక్టోబర్ 11, జనస్వరం :** తుమ్మల వెంకటేశ్వర స్వామి ఆలయంలో అమావాస్య మరియు రెండవ శనివారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చింతా శరత్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తుమ్మలకొండ వెంకటేశ్వర స్వామిని దర్శించడానికి వచ్చే భక్తుల కోసం గోపిసెట్టి శ్రీనివాసులు మరియు వారి కుటుంబ సహకారంతో మంచినీరు మరియు భోజన సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకోలేని భక్తులు, తుమ్మలయ్య కొండను తిరుమల కొండగా భావించి ఇక్కడే తమ మొక్కులు తీర్చుకునే ఆనవాయితి గత అనేక సంవత్సరాలుగా కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. తుమ్మల కొండ వెంకటేశ్వర స్వామిని దర్శిస్తే తమ మొక్కులు నెరవేరుతాయని భక్తులు విశ్వసిస్తారని, ముఖ్యంగా పెళ్లిళ్లు, సంతానం కోసం ప్రార్థనలు చేసేందుకు భక్తులు ఇక్కడికి వస్తుంటారని తెలిపారు. మన రాష్ట్రంతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని చిక్కబల్లాపూర్, బాగేపల్లి, పావగడ తదితర ప్రాంతాల నుంచి స్వామివారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తారని, ఆలయ కమిటీ సభ్యులు కొట్టు అశ్వర్థ కుమార్, కొట్టు రామాంజినేయులు, శ్రీనివాసులు, రామచంద్ర, ఈశ్వర్య, సరళమ్మ, ఉమాపతి రెడ్డి, పూజారి రమణ తదితరులు తెలిపారు.

# ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ




**కొడంగల్, అక్టోబర్ 11 (జనస్వరం) :** మండల పరిధిలోని పాత కోడంగల్ గ్రామంలో శుక్రవారం ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణ ఏర్పాటుకు సంబంధించి భూమి పూజ కార్యక్రమంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో కొడంగల్ ప్రాంతం ఎడ్యుకేషన్ హబ్ గా మారిందన్నారు. కొడంగల్ లో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ముందుకెళుతున్నారని ప్రతి ఒక్కరూ అభివృద్ధికి సహకరించాలని కోరారు. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ దసరా పండుగ కానుకగా విద్యార్థుల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను తీసుకురావడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పి నారాయణ,కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి,అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన ఉపవాస ఉజ్జీవ కూడికలు



**పాయకరావుపేట, అక్టోబరు 11, జనస్వరం :** మండలంలోని అరట్లకోట ఎఎంబి (అప్పారావు మెమోరియల్ బాప్టిస్ట్) చర్చిలో మూడు రోజులపాటు జరిగే " ఉపవాస ఉజ్జీవ కూడికలు " శుక్రవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 11, 12, 13 తేదీల్లో సాయంత్రం ఆరు గంటల నుంచీ చర్చి ఆవరణలో ఈ ఉపవాస ఉజ్జీవ కూడికలు జరుగుతాయి. మొదటి రోజైన శుక్రవారం సాయంత్రం ప్రారంభమైన ఈ ఉజ్జీవ కూడికలో స్థానిక సంఘ యూత్ సభ్యులు ఆలపించిన క్రైస్తవ భక్తి గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సంధర్భంగా సంఘ సభ్యులందరూ భక్తి శ్రద్ధలతో యేసు క్రీస్తుకు ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమానికి అద్భుతమైన సాక్షం కలిగిన దైవ జనులు బ్రదర్ తాళ్ళూరి రాజ్ కుమార్ ముఖ్య అతిధిగా విచ్చేసి దేవుని వాక్య సందేశాన్ని అందజేశారు.

# సభ్యత్వ నమోదుపై చర్చ

**నందిగామ, అక్టోబర్ 11 (జనస్వరం) :** నియోజకవర్గంలో సభ్యత్వాల్లో భాగంగా శుక్రవారం టౌన్ ఇంచార్జ్ కాకాని తరుణ్. నియోజకవర్గ ఇన్చార్జ్ పోరు గండి నరసింహారావు, అసెంబ్లీ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య సభ్యత్వ నమోదు గురించి చర్చించారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు మూడు వేల సభ్యత్వాలు చేసినట్లు తెలిపారు. 16వ తారీకు వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉన్నందువలన మండల అధ్యక్షులు, సభ్యత ప్రముఖులను ఈ ఐదు రోజులలో మరొక మూడు వేలు చేయాలని కాకాని తరుణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గుత్తా బాలకృష్ణ, గంటా వెంకట్రావు, మొక్కపాటి నరసింహారావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కొత్త సాంబశివరావు, మార్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రా వూరి రమేష్, గోనెల సత్యనారాయణ, కట్టుకూరి సుందరావు, కంచికచర్ల ఇన్చార్జి రమాదేవి, రమణ, పసుపులేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం, నందిగామ లో కాకాని వెంకటరత్నం డిగ్రీ కాలేజ్ , అలాగే ఆయన పేరు మీద కాకాని నగర్ ఉండటం వంటివన్నీ కాకాని తరుణ్ నెమరువేసుకున్నారు. ఈ ప్రాంతం తో ఆయన కుటుంబానికి ఉన్న సంబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అనంతరం భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ గారి స్ఫూర్తి తో నందిగామ టౌన్ సభ్యత్వ ఇంచార్జి డిఆర్ కాకాని తరుణ్ గారి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు సన్మానం జరిపి దసరా




శుభాకాంక్షలు తెలిపి వారికి ఆర్థిక సహాయం చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏపీఎస్ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఆయుధ పూజ

**ఎమ్మిగనూరు, అక్టోబర్ 11 (జనస్వరం) :** స్థానిక ఏపీఎస్ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఆయుధపూజ నిర్వహించారు. ఆయుధ పూజ అనేది వ్యవసాయ ఉపకరణాలు యంత్రాలు వాహనాలు కంప్యూటర్లు వంటి ప్రజల జీవితంలో అంతర్భాగమైన పరికరాలు సాధనలను పూజించటానికి అంకితం చేయబడిన రోజు ఈ రోజున ప్రజలు తమ పనిముట్లను శుభ్రం చేసి అలంకరిస్తారు వారి శ్రేయస్సు వారి పనిలో విజయం కోసం దైవిక ఆశీర్వాదాలు కోరుతూ వాటికి పూజ చేస్తారు ఈరోజు అమ్మవారు మహిషాసురుడిని అంతం చేసి మహిషాసుర మర్దిని గా నామాన్ని స్థిరం చేసుకుంది. దుష్ట శిక్షణ శిక్ష రక్షణ చేసి శాంతి స్వరూపిణి ఆ అమ్మవారిని ఎమ్మిగనూరు ఏపీఎస్ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ఉద్యోగులంతా పూజలు చేసి అమ్మవారిని కొలిచారు. తమ డిపోలో ఎటువంటి దుష్టశక్తి రాకుండా ఉండుటకు ఎమ్మిగనూరు డిపో బస్సులు ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించాలని డిపో అభివృద్ధి చెంది లాభాల బాటలో రావాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంగన్న, మహేశ్వర్ రెడ్డి, కే.కే., ప్రసాద్, శరణప్ప, ఎం ఎల్ రెడ్డి, సురేష్ బాబు, బజార్ అప్ప, నేషనల్ మద్దూర్ యూనిటీ అసోసియేషన్ కార్యదర్శి ముస్తాక్ అహ్మద్, సహాయ కార్యదర్శి మదార్ సబ్, ముస్లిం మైనారిటీ అసోసియేషన్ సహాయ కార్యదర్శి పీఎం భాషా, షఫీ ఉల్లా, ఎలక్ట్రిషన్ ఉస్మాన్, శారద, మరియు భారతమ్మ పాల్గొన్నారు.



# దుర్గమ్మ సేవలో ఎమ్మెల్సీ హరిప్రసాద్

**విజయవాడ, అక్టోబర్ 11 (జనస్వరం) :** విజయదశమి శరన్నవరాత్రుల సందర్భంగా మహిషాసుర మర్దిని అవతారంలో ఉన్న దుర్గమ్మను నసేన పార్టీ ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆ హరి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకుంటున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, మండలి రాజేష్, జనసేన పార్టీ విజయవాడ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ తిరుపతి సురేష్, రాజేశ్వరి, తిరుపతి అనూష, సాయి శరత్ తదితరులు పాల్గొన్నారు.



# దేశం గర్వించదగ్గ నాయకుడు పవన్ కళ్యాణ్

గుంటూరు, అక్టోబర్ 11 (జనస్వరం) : సమాజం పట్ల బాధ్యత , ప్రజల పట్ల ప్రేమ , దేశం పట్ల భక్తి ఉన్న పవన్ కళ్యాణ్ లాంటి నాయకులు అరుదుగా ఉంటారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీమతి గళ్ళా మాధవి అన్నారు. తన సామాజిక , రాజకీయ ప్రయాణం అంతా పోరాటాలు , త్యాగాలు , గుప్త దానాలతో నిండి ఉంటుందని దేశం గర్వించదగ్గ గొప్ప నాయకుడు పవన్ కళ్యాణ్ అంటూ ఆమె కొనియాడారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి ఆధ్వర్యంలో ప్రజలతో పవనుడు పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గళ్ళా మాధవి మాట్లాడుతూ విజయాలకు పొంగిపోకుండా అపజయాలకు కుంగిపోకుండా స్థిత ప్రజ్ఞతకు నిలువెత్తురూపంగా పవన్ కళ్యాణ్ నిలిచారన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తక్షణమే స్పందించే పవన్ కళ్యాణ్ తన సంపాదనలో అధిక భాగం దానాలకే ఖర్చు చేస్తారని పేర్కొన్నారు. జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ లాంటి నిస్వార్ధ నాయకుడి బాటలో పయనిస్తునందుకు గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో రెల్లి యువ నేత సోమి ఉదయ్ కుమార్, జనసేన నగర నాయకులు బొడ్డుపల్లి రాధాకృష్ణ, కదిరి సంజీవ్, యరసాని సత్యం, అలా కాసులు, వడ్డే సుబ్బారావు, శ్రీను, టీడీపీ నాయకులు కూరంగి శ్రీను, చింతకాయల సాయి, బాబు, తదితరులు పాల్గొన్నారు.



# నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన లత శ్రీ




కూనవరం అక్టోబర్ 11 జనస్వరం : పోలీస్ స్టేషన్ నూతన ఎస్సై గా లత శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన శ్రీనివాస్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై లతశ్రీ మాట్లాడుతూ... మండలం లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. నేరాలను అదుపులో ఉంచడానికి, తన వంతు కృషి చేస్తానని . ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పోలీసు సిబ్బంది నూతన ఎస్సై కి శుభాకాంక్షలు తెలిపారు.

# రెండు రోజులపాటు మద్యం దుకాణాలు బంద్

**భైంసా అక్టోబర్ 11 జనస్వరం :** రాష్ట్రవ్యాప్తంగా దసరా సంబురాల వేడుకలు ఘనంగా మొదలయ్యాయి. గతరాత్రి సద్దుల బతుకమ్మ పూల పండుగ సందడిగా సాగగా, శనివారం విజయ దశమి ఘనంగా జరగనుంది. రాష్ట్రంలో దసరా పండుగ అంటే కచ్చితంగా మందు, మాసం ఉండాల్సిందే. సుక్క లేనిదే వేడుకకు కిక్కు ఉండదు. కానీ పట్టణ పోలీస్, ఎక్సైజ్ శాఖా అధికారులు వారికి కిక్కు దించే సమాచారం అందించారు. ఈ నెల 13న దుర్గామాత నిమజ్జనం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా జరుపుకునేందుకు భైంసాతో పాటు ముధోల్ లోని శనివారం ఉదయం 10 గంటల నుంచి సోమవారం ఉదయం 10 గంటల వరకు మద్యం దుకాణాలు బంద్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.గత వినాయక నవరాత్రి ఉత్సవాల్లో జరిగిన గొడవలను దృష్టిలో ఉంచుకొని మద్యం దుకాణాలు మూసివేస్తున్నట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. సున్నితమైన ప్రాంతాల్లో ఎటువంటి ఘటనలు చోటు చేసుకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు శాంతి భద్రతల పరిరక్షణకై ముందస్తు బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

# ఘనంగా బతుకమ్మ వేడుకలు

**బొంరాస్ పేట, అక్టోబర్ 11 (జనస్వరం) :** మండల పరిధిలోని బురాన్ పూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం తిరొక్క పువ్వులతో అందంగా పేర్చి బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీటీసీ సుదర్శన్ రెడ్డి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బంటు పెంటయ్య ముదిరాజ్ సంఘం సభ్యులు బంటు రామచంద్రయ్య బోయిని వే మన్నా. డీలర్ విశ్వనాథం . కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జట్టు రి అనంతయ్య. దోమ నరసింహులు గ్రామ మహిళా సంఘం లీడర్ లక్ష్మి మహిళలు తదితరులు పాల్గొన్నారు



# తక్కువ ధరలకే సరుకులు

**దెందులూరు, అక్టోబర్ 11 (జనస్వరం) :** పేదలకు తక్కువ ధరలకే నూనెలు అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దెందులూరు లో తెల్ల రేషన్ కార్డులు ఉన్నవారికి తక్కువ ధరకు ఆయిల్ ప్యాకెట్లు అందించే కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లో ధరలు ఎక్కువగా ఉన్న కారణంగా పండుగలు వేల పేదలకు తక్కువ ధరకు అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సుమతి, అధికారులు, మండలంలోని టిడిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ఎస్ఐ లింగన్నను కలిసిన టిడిపి నాయకులు



**పుట్టపర్తి, అక్టోబర్ 11, జనస్వరం :** పుట్టపర్తి మండలం రూరల్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా పదవి బాధ్యతలు చేపట్టిన కె.యం.లింగన్న ను జగరాజుపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం దుశ్యాలువాతో సత్కరించి, స్వీట్ బాక్స్, పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగరాజుపల్లి పంచాయతీ ఇంచార్జ్ మురలీధర్ రెడ్డి, బూత్ కన్వీనర్ బాలు,సీనియర్ నాయకులు పరంధామయ్య, రామలింగప్ప, ఎస్సీ నాయకులు రామాంజనేయులు, చింతమాను కుంటెప్ప, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# రేపు కొడంగల్ రానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

కొడంగల్, అక్టోబర్ 11 (జనస్వరం) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దసరా పండుగ అనంతరం ఈనెల 13న ఆదివారం కొడంగల్ పట్టణంలోని తన నివాసానికి రానున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నందారం ప్రశాంత్ తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే దసరా మరుసటి రోజు కార్యకర్తలను కలుసుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. సీఎం ఆదివారం కొడంగల్ రానున్న నేపథ్యంలో అధికారులు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

